పోలీసు ముసుగులో వసూళ్లు

నిందితుడిపై పీడీ యాక్టు

మాదాపూర్, మే 1: పోలీసు అధికారి ముసుగులో అమాయకులను మోసం చేస్తూ వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్న నిందితుడు పోలీసులకు పట్టుబడ్డాడు. మాదాపూర్ ఇన్స్పెక్టర్ మల్లేశ్ బుధవారం తెలిపిన కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నాగరాజు రఘు వర్మ అలియాస్ కార్తీక్ అలియాస్ వరుణ్ కల్నల్ అలియాస్ కార్తికేయ సింగ్ (25) బజాజ్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఏపీలోని కమిషనర్ ఆఫ్ పోలీస్, సైబరాబాద్ నం 2/పీడీ- సెల్ ఎస్‌బీ/ సైబరాబాద్/2024 పేరుతో దొంగ ఐడీ కార్డులను తయారు చేసి, పోలీసు అధికారిగా చలామణవుతూ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నాడు. అమాయకులను మోసం చేస్తున్నాడు.

గతంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కాల్పులు జరిపి, పలువురిని కిడ్నాప్ చేసి, డబ్బులు వసూలు చేశాడు. తాజాగా పోలీసు ముసుగులో ప్రజా భద్రతకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించడంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి, పీడీ యాక్టు కూడా విధించారు. నిందితుడిపై గతంలో ఏపీ, హైదరాబాద్‌లోని పలు పోలీస్ స్టేషన్లలో అక్రమ ఆయుధాల సరఫరాకు సంబంధించిన 9 కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మేయర్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి వీరంగం

బంజారాహిల్స్, మే 1: జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఇంట్లోకి ప్రవేశించి, న్యూసెన్స్‌కు పాల్పడిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 12లో ఉన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఇంట్లోకి బుధవారం సాయంత్రం గుర్తు తెలియని ఓ వ్యక్తి వచ్చాడు. మేయర్ ఇంట్లో లేదని సిబ్బంది చెప్పగా.. కాసేపు హాల్‌లో కూర్చున్న ఆగంతకుడు మొదటి ఫ్లోర్‌లో ఉన్న గదిలోకి వెళ్లాడు. అక్కడకు వెళ్లిన తర్వాత గట్టిగా కేకలు వేస్తూ తనను మేయర్‌తో మాట్లాడించాలని, తాను బాంబే నుంచి వచ్చానంటూ వీరంగం సృష్టించాడు. దీంతో మేయర్ కార్యాలయం సిబ్బంది అక్కడకు చేరుకుని కిందకు తీసుకువచ్చే ప్రయత్నం చేసినా వినకుండా, తాను రౌడీషీటర్‌ను అని, దగ్గరకు వస్తే అంతుచూస్తానంటూ బెదిరించాడు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అక్కడకు చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆగంతకుడి పేరు లక్ష్మణ్ అని పోలీసుల విచారణలో తేలింది. కాగా, అతడి మానసిక స్థితిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మేయర్ ఇంట్లో వంటమనిషి బాలాజీ ఇచ్చిన ఫిర్యాదుతో ఐపీసీ 448, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడ్చల్, మే 1 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలో నివాసముండే యాదయ్య(47) బుధవారం ఉదయం శ్వేత క్లినిక్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అతడు తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల పందెం నిర్వాహకుల అరెస్టు

శామీర్‌పేట, మే 1 : శామీర్‌పేట పోలీసులు బుధవారం గొర్రెల పందెం నిర్వాహకులను అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో కొందరు గొర్రె పోటీల్ పందాలను నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 2 గొర్రె పోటీళ్లు, 5 సెల్‌ఫోన్లు, 2 ఆటోలు, 8 మందిని అరెస్టు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కొనసాగుతున్న తనిఖీలు

రూ. 21.57 కోట్ల నగదు స్వాధీనం

పట్టుబడిన నగదును లెక్కిస్తున్న పోలీసులు

సిటీబ్యూరో, మే 1, (నమస్తే తెలంగాణ)/మలక్‌పేట: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు గ్రేటర్ వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా ఎన్నికల కోడ్ వచ్చిన ప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.21.57 కోట్ల నగదును ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ తెలిపారు.

రూ.13.76 కోట్ల విలువజేసే ఇతర వస్తువులు, 26,416.28 లీటర్ల అక్రమ మద్యాన్ని కూడా పట్టుకున్నట్లు చెప్పారు. 261 మందిపై కేసులు నమోదు చేసి, 258 మందిని అరెస్టు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన నగదు, ఇతర వస్తువులపై 551 ఫిర్యాదులు రాగా, వాటిని పరిష్కరించారని, 354 మందిపై ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 3, 068 లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేసినట్లు రొనాల్డ్‌రాస్ తెలిపారు. తాజాగా, గడిచిన 24 గంటల వ్యవధిలో రూ.ఒకకోటి 89 లక్షల నగదు, రూ.4.32 కోట్ల విలువైన వస్తువులను పట్టుకొని సీజ్ చేసినట్లు చెప్పారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో రూ.1.68 కోట్లు..

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి ఆధారాలు లేకుండా గూడ్స్ వాహనంలో తరలిస్తున్న రూ.1,68,87,800 నగదును మలక్‌పేట పోలీసులు పట్టుకొని, ఎన్నికల కమిషన్ అధికారులకు అప్పగించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం మలక్‌పేట పోలీసులు దిల్‌సుఖ్‌నగర్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ గూడ్స్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, అందులో రూ.1,68,87,800 నగదు లభించింది. అయితే, ఆ నగదుకు సంబంధించి సరైన ఆధారాలను (పత్రాలను) చూపించక పోవడంతో సీజ్ చేసి, ఎన్నికల కమిషన్ అధికారులకు అప్పగించారు. కాగా, ఈ ఘటన మంగళవారం సాయంత్రం జరిగినా, బయటకు రాకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకోవడం గమనార్హం.

సైబరాబాద్ పరిధిలో రూ.1.06 కోట్లు..

సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఆరు ఠాణాల పరిధిలో నగదు తరలిస్తున్న వాహనాలపై ఎస్ఓటీ పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో రూ.1.06కోట్ల నగదును పట్టుకుని సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కమిషనరేట్ పరిధిలోని వివిధ బ్యాంకులకు నగదును తీసుకెళ్లే ఆయా కంపెనీలకు చెందిన లాజిస్టిక్స్ వాహనాలు ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా, సరైన క్యూఆర్ కోడ్‌లు, నియమాలు పాటించడం లేదు. సమాచారం అందుకున్న సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు కమిషనరేట్ పరిధిలోని దుండిగల్, అత్తాపూర్, శామీర్‌పేట, చందానగర్, రాజేంద్రనగర్, కూకట్‌పల్లి పోలీసు స్టేషన్ల పరిధిలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో బ్యాంకులకు నగదు రవాణా చేస్తున్న క్యాష్ లాజిస్టిక్, సీఎంఎస్ క్యాష్ లాజిస్టిక్స్, ఎస్ఐఎస్ ప్రొసీజర్ క్యాష్ లాజిస్టిక్స్‌కు చెందిన ఆరు వాహనాల్లో రూ.కోటి ఆరు లక్షల నగదును పట్టుకుని సీజ్ చేశారు. ఇందులో కూకట్‌పల్లి ఠాణా పరిధిలో రూ.2,62,600, రాజేంద్రనగర్ పరిధిలో రూ.5,01,993, చందానగర్ పరిధిలో రూ.7,38,237, శామీర్‌పేట పరిధిలో 9,11,900, అత్తాపూర్ పరిధిలో 22,30,600, దుండిగల్ పరిధిలో రూ.60,17,400 చొప్పున నగదును సీజ్ చేసినట్లు ఎస్ఓటీ పోలీసులు వివరించారు.

తల్లిపై దాడి కేసులో కుమారుడికి జైలు

జగద్గిరిగుట్ట, మే 1: తల్లిపై దాడికి పాల్పడిన కేసులో కుమారుడికి జైలు శిక్ష పడింది. జగద్గిరిగుట్ట ఇన్స్పెక్టర్ క్రాంతికుమార్ కథనం ప్రకారం.. జగద్గిరిగుట్ట అంజయ్యనగర్‌లో పరశురాములు కుటుంబం ఉంటుంది. అతడి పెద్ద కుమారుడు అనిల్ కుమార్ (39)కు వివాహం కావడంతో వేరుగా ఉంటున్నాడు. కాగా, 2017లో తండ్రి ఇంటి వద్దకు వచ్చిన అతడు ఇంటిలోని సామగ్రి పగులగొట్టడంతోపాటు తల్లి ఉమాదేవిపై దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కూకట్‌పల్లి మెట్రోపాలిటన్ కోర్టు బుధవారం అనిల్‌కుమార్‌కు ఏడాది జైలు, రూ.3వేలు జరిమానా విధించింది.

లిఫ్ట్ ఎక్కిందని.. యువతిపై దాడి

వెంగళరావునగర్, మే 1: లిఫ్ట్ ఎక్కిందని ఓ యువతిపై దాడికి పాల్పడిన ఘటన అమీర్‌పేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాంపల్లికి చెందిన రిసెప్షనిస్ట్ సుల్తానా (22) అమీర్‌పేట మెట్రో స్టేషన్ సమీపంలోని వాసవీ ఎంపీఎం గ్రాండ్‌కు మంగళవారం ఉదయం వచ్చి.. లిఫ్టులో ఐదో ఫ్లోర్‌కు వెళ్లింది. ఈ సమయంలో గుర్తు తెలియని ఓ మహిళ లిఫ్ట్ ఎందుకు ఎక్కావంటూ సుల్తానాపై కేకలు వేసింది. మళ్లీ సాయంత్రం లిఫ్టులో కిందకు దిగే క్రమంలో.. ఆ మహిళ మరో వ్యక్తితో కలిసొచ్చి సుల్తానా బుర్ఖాను లాగి.. ముఖంపై పిడిగుద్దులు గుద్దింది. బాధితురాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఐఏఎస్ అధికారికి సైబర్ టోకరా

ఖాతా నుంచి డబ్బులు కాజేసిన సైబర్ నేరగాళ్లు

బంజారాహిల్స్, మే 1: విశ్రాంత ఐఏఎస్ అధికారి బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్‌నగర్‌లో నివాసముంటున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆర్ఎస్. గోయల్‌కు జూబ్లీహిల్స్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో అకౌంట్ ఉంది. గత నెల 10న రూ.24వేలు డ్రా అయినట్లు గోయల్ సెల్‌ఫోన్‌కు బ్యాంకు నుంచి మెసేజ్ వెళ్లింది. తనకు సంబంధం లేకుండా తన అకౌంట్ లోనుంచి డబ్బులు ఎలా ట్రాన్స్‌ఫర్ అయ్యాయంటూ మరుసటి రోజున ఎస్‌బీఐ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. బ్రాంచ్‌కు వెళ్లి వాకబు చేయగా.. బీహార్‌లోని ధన్‌బాద్‌కు చెందిన కాంతిదేవి అనే మహిళకు చెందిన అకౌంట్‌లోకి డబ్బులు వెళ్లినట్లు తేలింది. ఈ మేరకు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా స్పందన లభించలేదు. దీంతో గురువారం ఆయన జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐపీసీ 420, 66 (డి) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

బంజారాహిల్స్,మే 1: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 5లోని దోభీఘాట్ బస్తీలో నివాసం ఉంటున్న రేవల్లి కాశయ్య(65) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంటాడు. ప్రతి రోజు మద్యం తాగివచ్చి గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఇంట్లోంచి వెళ్లిపోయిన కాశయ్య సమీపంలోని పంజా గుట్ట శ్మశానవాటికలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టి రాత్రి మృతదేహాన్ని గుర్తించారు. ఈ మేరకు కాశయ్య కొడుకు మహేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

క్రిప్టో కరెన్సీలో పెట్టుబడుల పేరిట మోసపోయాం

వెంగళరావునగర్, మే 1: క్రిప్టో కరెన్సీతో పెట్టుబడులు పెట్టి మోసపోయిన బాధితులు తమకు న్యాయం చేయాలని బుధవారం ఎస్ఆర్ నగర్ పోలీసులను ఆశ్రయించారు. అనంతరం బాధితులు బి.విశాల్‌రాజ్ జకారియస్, ఎం.శ్రీకాంత్, పి. రామయ్య, నవజీవన్ విలేకరులతో మాట్లాడుతూ.. 2018లో తమకు పరిచయమైన అంగూరి ప్రకాశ్ కుమార్ అనే వ్యక్తి క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే పెద్దమొత్తంలో లాభాలొస్తాయని నమ్మించాడని, దీంతో తాము దశల వారీగా రూ.65,36,590 నకిలీ వెబ్ సైట్ ద్వారా పెట్టుబడి పెట్టి మోసపోయామన్నారు. తాము పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై కేసు నమోదయ్యిందన్నారు. ఈ కేసులో నిందితులను పట్టుకుని తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరామన్నారు.

యువతి ముసుగులో డేటింగ్

యువకులకు గాలం వేసి దోచుకుంటున్న వ్యక్తి అరెస్టు

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ): యువతి ముసుగులో డేటింగ్ చేస్తూ.. అమాయక యువకులకు గాలం వేయడమే కాకుండా, మాయమాటలతో వారి నుంచి డబ్బులు దోచుకుంటున్న ఓ మోసగాడిని సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. వనస్థలిపురం ప్రాంతానికి చెందిన మేఘరాజ్ దినేశ్ గేమింగ్, బెట్టింగ్ తదితర వ్యసనాలకు అలవాటు పడి, అవసరమైన డబ్బు కోసం అమాయకులను మోసగించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో క్వాక్ క్వాక్, టిండర్, బంబుల్, ఇండియన్ డేటింగ్ తదితర డేటింగ్ యాప్‌లను ఎంచుకుని వాటిల్లో అందమైన అమ్మాయిల ఫొటోలతో కూడిన నకిలీ ప్రొఫైల్‌తో ఖాతాలను సృష్టించి, యువకులను ఆకర్షించాడు. అనంతరం వారితో డేటింగ్ చేస్తూ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని.. ఇలా పలు రకాలుగా అమాయకులను నమ్మించాడు. కొన్ని రోజుల తరువాత.. తనకు అత్యవసరంగా డబ్బు అవసరం ఉందంటూ వివిధ కారణాలతో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసగించాడు. ఈ క్రమంలోనే నగరానికి చెందిన ఒక వ్యక్తికి క్వాక్ క్వాక్ డేటింగ్ యాప్ ద్వారా 'స్వేతా శెట్టి' ప్రొఫైల్‌తో రిక్వెస్ట్ పెట్టాడు. యువతి ముసుగులో బాధితుడిని ఆకర్షించిన నిందితుడు.. అత్యవసరమంటూ రూ.4,09,200ను దోచుకున్నాడు. రోజులు గడుస్తున్నా సదరు యువతి తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు భావించిన బాధితుడు.. సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు బుధవారం నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

జలమండలికి ఐఏఎస్‌ల బృందం

సిటీబ్యూరో, మే 1, (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన 2022 బ్యాచ్‌కు చెందిన ఆరుగురితో కూడిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం బుధవారం జలమండలిని సందర్శించింది. ఒక రోజు ఒరియెంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఖైరతాబాద్ జలమండలి ప్రధాన కార్యాలయానికి విచ్చేసిన ఈ బృందం.. సంస్థ కార్యకలాపాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నది. సంస్థ పనితీరు, కోటి 30 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరానికి భారీ పైపులైన్ల ద్వారా మంచి నీరు సరఫరా చేస్తున్న విధానం, మురుగుశుద్ధి నిర్వహణ, భవిష్యత్ ప్రణాళికలను ఎండీ సుదర్శన్‌రెడ్డి ట్రైనీ ఐఏఎస్‌లకు వివరించారు. సుదూర ప్రాంతాల నుంచి సరఫరా చేసే విలువైన నీటిని వృథా చేయకుండా ఎప్పటికప్పుడు చేపట్టే అవగాహన కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్లు వీఎల్ ప్రవీణ్‌కుమార్, అజ్మీరా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా సభ..

ఎన్నికల సంఘం ఫిర్యాదుతో కాంగ్రెస్ నేతపై కేసు

బంజారాహిల్స్, మే 1: ఎన్నికల సంఘం అనుమతి లేకుండా సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా భారీ సభ నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నేత మామిడి నర్సింగరావుపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా మంగళవారం ఫిలింనగర్ రోడ్ నం.41లోని మహేశ్వరి రెసిడెన్స్ ఎదుట ఖాళీ స్థలంలో మామిడి నర్సింగరావు సభ ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారి వద్ద నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా జనాన్ని సమీకరించి సభను ఏర్పాటు చేయడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనంటూ ఎన్నికల సంఘం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జి.శ్రీకాంత్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సభ ఏర్పాటుకు ఖర్చయిన వ్యయాన్ని ఎంపీ అభ్యర్థి ఖాతాలో చూపించకుండా ఉండేందుకే అనుమతి తీసుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు మామిడి నర్సింగరావుపై ఫిలింనగర్ పోలీసులు కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మెడికల్ షాపులపై డీసీఏ దాడులు

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు ప్రకటనలతో ఔషధాలను విక్రయిస్తున్న పలు మెడికల్ షాపులపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో పెద్ద ఎత్తున 'కొలినాల్-స్పాస్' మాత్రలను సీజ్ చేశారు. డీసీఏ డీజీ వీబీ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం.. ఉత్తరాఖండ్ కేంద్రంగా వీవీ మెడ్ ల్యాబ్స్ ప్రై.లి. ఫార్మా సంస్థ కొలినాల్-స్పాస్ అనే మాత్రలను తయారు చేసి విక్రయిస్తున్నది. ఆ మాత్రలపై డ్రగ్స్ అండ్ మాజిక్ రెమిడీస్ (అభ్యంతర ప్రకటనలు) చట్టం 1954కు విరుద్ధంగా 'నెలసరి సంబంధిత రుగ్మతలకు చికిత్స చేస్తుంది' అనే ప్రకటనతో కూడిన లేబుల్స్ సదరు ఫార్మా సంస్థ ముద్రించి మార్కెట్‌లో విక్రయిస్తున్నది. ఈ మేరకు సమాచారం అందుకున్న మెహిదీపట్నం, గోషా మహల్‌కు చెందిన డీసీఏ అధికారులు నాంపల్లి తదితర ప్రాంతాల్లోని పలు మెడికల్ షాపులపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో తప్పుడు ప్రకటనలతో కూడిన 'కొలినాల్-స్పాస్' మాత్రలను సీజ్ చేశారు. అనంతరం సంబంధిత ఔషధ తయారీ కంపెనీకి నోటీసులను జారీ చేశారు.

స్నాచింగ్ అడ్డుకుంటే కత్తితో పొడిచేస్తారు

గుడిమల్కాపూర్‌లో సెల్‌ఫోన్ స్నాచర్ల చేతిలో యువకుడు బలి

రాత్రివేళ ఒంటరిగా వెళ్లాలంటే భయాందోళనలో నగర వాసులు

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ): సెల్‌ఫోన్ స్నాచర్లు బరితెగిస్తున్నారు.. అడ్డొస్తే అడ్డంగా నరికేసి, సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్తున్నారు. గుడిమల్కాపూర్‌లో మంగళవారం అర్ధరాత్రి సమయంలో సెల్‌ఫోన్ స్నాచర్లు ఒక వ్యక్తిని హత్యచేసి, సెల్‌ఫోన్ అపహరించారు. ఈ ఘటన తీవ్ర సంచలనం రేపుతోంది. శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసులు నిద్రావస్థలో ఉన్నప్పుడే ఇలాంటి దోపిడీ దొంగలు రెచ్చిపోయేందుకు అవకాశం ఉంటుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో పెట్రోలింగ్‌తో పాటు పికెటింగ్ వాహనాల తనిఖీలు కూడా ఉంటాయి. అయినా.. బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు అత్తాపూర్‌లో పుట్‌పాత్‌పై వ్యాపారం చేసే సనావుల్లా (24)ను కత్తులతో పొడిచి హత్య చేశారు. బైక్‌పై వచ్చిన దుండగులు దాడిచేసి, అతడి వద్దనున్న సెల్‌ఫోన్‌ను లాక్కొని వెళ్లేందుకు ప్రయత్నించారు. బాధితుడైనా సనావుల్లా ప్రతిఘటించడంతో దుండగులు కత్తితో దాడిచేసి, ఫోన్ లాక్కొని పారిపోయారు. స్థానికులు దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు సనావుల్లా మృతి చెందినట్లు నిర్ధారించారు.

సెల్‌ఫోన్ స్నాచింగ్ మాఫియా..!

హైదరాబాద్‌లో సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేసే మాఫియా గ్యాంగులు తిరుగుతున్నాయి. ఇటీవలే పోలీసులు హైదరాబాద్ టూ సూడాన్‌కు స్నాచింగ్ ఫోన్లు వెళ్తున్న విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. దొంగిలించిన ఫోన్లకు మంచి గిరాకీ ఉండటంతో సెల్‌ఫోన్ స్నాచింగ్‌లు చేసే నేరగాళ్ల సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతోంది. గతంలో మహిళల మెడలో నుంచి మంగళసూత్రాలు లాక్కొని పరారయ్యే స్నాచర్లపై గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఉక్కుపాదం మోపింది. 2004 నుంచి 2014 వరకు నగరంలో ప్రతిరోజు దాదాపు 10 స్నాచింగ్ నేరాలు నమోదయ్యాయి.

2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్నాచర్లపై ఉక్కుపాదం మోపింది. ఇందులో భాగంగా ఇతర రాష్ట్రాల్లో ఉన్న స్నాచర్లను సైతం జైలులో పెట్టారు. 2014 ముందు రోజుకు పది స్నాచింగ్‌లు జరుగగా.. 2014 తర్వాత ఏడాదిలో పది స్నాచింగ్‌లు కూడా జరగలేదు. ఎక్కడైనా స్నాచింగ్ జరిగితే.. ఫిర్యాదు వచ్చిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగి నేరగాళ్లను పట్టుకొని, సొత్తు రికవరీ చేశారు.

దీంతో నగరంలో దాదాపు చైన్‌స్నాచింగ్ నేరాలు తగ్గిపోయాయి. అయితే, నేడు అందుకు భిన్నంగా సెల్‌ఫోన్ స్నాచర్లు రెచ్చిపోతున్నారు. రోజు రోజుకు సెల్‌ఫోన్ స్నాచింగ్‌లకు పాల్పడే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ నేరాలను కట్టడి చేయడంలో ట్రై పోలీస్ కమిషనరేట్ పోలీసులు పూర్తిగా విఫలమవుతున్నారు. సెల్‌ఫోన్ స్నాచింగ్ ముఠాలను అణిచివేయడంలో కఠిన చర్యలు తీసుకుంటే, నేడు స్నాచర్లు హత్యల వరకు వచ్చే వారా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పెట్రోలింగ్ వ్యవస్థ, స్థానిక పోలీసుల పర్యవేక్షణ లోపం వల్లే రోడ్లపై నేరగాళ్లు యథేచ్ఛగా తిరుగుతున్నారు. ఇలాంటి ఘటనలతో హైదరాబాద్‌లో అర్ధరాత్రి రోడ్లపై నడువాలంటేనే భయపడాల్సి వస్తుంది. ఒంటరిగా వెళ్లాలంటే భయపడుతున్నారు. ఒంటరిగా వెళ్లే వారినే టార్గెట్‌గా చేసుకొని, సెల్‌ఫోన్ స్నాచింగ్ మాఫియా దాడులు చేయడం, ఆ తరువాత హత్యలకు తెగబడుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సెల్‌ఫోన్ స్నాచర్ల విషయాన్ని సీరియస్‌గా తీసుకొని, కట్టడి చేయాలంటూ ప్రజలు కోరుతున్నారు.

అడ్డుకున్న యువకుడికి కత్తిపోట్లు.. మృతి

కార్వాన్, మే 1: సెల్‌ఫోన్ లాక్కుని పారిపోతున్న దుండగులను అడ్డుకునే ప్రయత్నం చేసిన యువకుడు కత్తిపోట్లకు గురై మృతి చెందాడు. ఈ ఘటన గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ బైరి రాజు కథనం ప్రకారం.. మెహిదీపట్నం మురాద్‌నగర్‌కు చెందిన సనాఉల్లా(24) తన స్నేహితుడితో కలిసి మంగళవారం రాత్రి గుడిమల్కాపూర్‌లో ఉన్న తన సోదరుడి దుకాణం వద్ద ఉన్నాడు. పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 66 వద్ద సనాఉల్లా తన స్నేహితుడితో కలిసి మాట్లాడుతున్న సమయంలో బ్లాక్ కలర్ స్కూటీపై వచ్చిన ఇద్దరు దుండగులు చిరునామా అడిగినట్లు నటించి.. సెల్‌ఫోన్ లాక్కుని పారిపోవడానికి యత్నించారు. ప్రతిఘటించిన సనాఉల్లాను కత్తులతో చాతిపై పొడిచి పారిపోయారు. తీవ్రగాయాల పాలైన సనాఉల్లాను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితులను పట్టుకునేందుకు ముమ్మరంగా గాలిస్తున్నట్టు ఇన్స్పెక్టర్ తెలిపారు.

పది ఫలితాల్లో సత్తా చాటిన బ్రిలియంట్ విద్యార్థులు

జూబ్లీహిల్స్, మే1: తెలంగాణ ఎస్ఎస్సీ- 2024 ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఈ విద్యా సంస్థ నుంచి 1690 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 123 మంది 10 జీపీఏ సాధించారని డైరెక్టర్ ప్రసాదరావు తెలిపారు. ఫలితాల్లో 586 మంది ఏ గ్రేడ్, 512 మంది ఏ 2 గ్రేడ్‌లు సాధించగా.. మిగతా విద్యార్థులు మెరుగైన ఫలితాలతో 98 శాతం ఉత్తమ ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విద్యా సంస్థల్లో విద్యనభ్యసించి గత 38 సంవత్సరాలుగా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలిచారని, అలాగే ఈ సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులు కూడా ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

BRILLIANT
G